క్లుప్తంగా

ఆర్డీటీకి స్థలం వితరణ



మాంఛోఫెర్రర్‌కు స్థల పత్రాలను అందజేస్తున్న నాగార్జునరెడ్డి కుటుంబసభ్యులు

తాడిపత్రిటౌన్: చిన్నపోలమడ సమీపంలోని ఆర్‌టీఓ కార్యాలయం వద్ద ఉన్న దాదాపు 10 సెంట్ల స్థలాన్ని ఆర్డీటీ సంస్థకు వితరణ చేసినట్లు టీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి తెలిపారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురంలోని ఆర్డీటీ కార్యాలయంలో సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌కు స్థలపత్రాలను అందజేశారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: నందలపాడు సమీపంలోని మోడల్ పాఠశాల వద్ద పేకాట ఆడుతున్న 8 మందిని గురువారం అరెస్ట్ చేసినట్లు ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. నిందితుల నుంచి రూ.8,080 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదిలా ఉండగానందలపాడు సమీపంలోని పెన్నా నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న 6 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం



బాధితులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: ఇటీవల పట్టణంలోని పాత ఈద్గా సమీపంలో ప్రమాదవశాత్తు పెయింటర్ బాబా అనే వ్యక్తి పూరిల్లు కాలిపోయిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం కాలిపోయిన పూరింటిని పరిశీలించారు. బాధితులు బాబా దంపతులన పరామర్శించారు. వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.25 వేలు ఆర్థిసాయం అందజేశారు. ప్రభుత్వం తరపున నష్టపరిహారాన్ని అందేటట్లు చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని రాయల్ సర్కిల్ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. పాత కొత్త చెరువు గ్రామానికి చెందిన రామాంజనేయులు రాయల్ సర్కిల్ వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీ కొనింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎంపీజే క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు: మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) సంస్థ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రైల్వే జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ గురువారం ఆవిష్కరించారు. ఎంపీజే పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లాబకాష్, హఫీజ్, కోశాధికారి నయింబాషా, జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: సీపీఎం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు ఆవిష్కరించారు. నాయకులు దాసరి శీనా, మారుతి, నాగరాజు, రమేష్, జగ్గిలి రమేష్, రంగమ్మ, షబ్బీర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

యల్లనూరు: మండలంలోని వెన్నపూసపల్లి, వెంకటాంపల్లిలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, సర్పంచు నాగకుమారి, ఎంఈఓ-2 పరమేశ్వరరెడ్డి, బ్యాంకు మేనేజరు మధు, పంచాయతీ కార్యదర్శి మాబు, వెంకటాంపల్లి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



వృద్ధులకు నిత్యవసరాలు అందిస్తున్న నిర్మలాదేవి

శింగనమల: ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి జన్మదినాన్ని పురస్కరించుకొని అనంతపురంలోని సురక్ష సేవా సమాజ్ వృద్ధాశ్రమానికి ఎమ్మెల్యే తల్లి జొన్నలగడ్డ నిర్మలాదేవి , ఆలూరు బాలమ్మ నిత్యావసరాలు అందజేశారు. నిరుపేద వృద్ధులకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు.

జగనన్నతోనే ప్రజాసంక్షేమం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



పెద్దవడుగూరులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, కోట కాలనీల్లో గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గూడూరు సూర్యనారాయణరెడ్డి, హరినాథరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, వెంకటస్వామిగౌడ్, శేషారెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ వరలక్ష్మి, పాశం రంగస్వామియాదవ్, నార్త్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ మాజీ చైర్మన్ ఎద్దుల సూర్యప్రభాకర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బాలచంద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పుట్లూరు కృష్ణారెడ్డి, నాగరాజు, నాగభూషణం, సుంకన్న, శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, కందిగోపుల మురళీ, మిడుతూరు సర్పంచ్ రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

తాడిపత్రి అర్బన్: అన్ని వర్గాలకు అండగా ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోరారు. పట్టణంలోని 27వ వార్డులో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ కలియ తిరుగుతూ ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కులమతాలు, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలత, పట్టణ కన్వీనర్ జావిద్‌ఖాద్రీ, విద్యార్థి విభాగం అధ్యక్షుడు మనోజ్, నాయకులు పేరం ప్రతాప్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి బాబా, డీవీ కుమార్, ఫయాజ్, జిలాన్ పాల్గొన్నారు.

ప్రతిష్ఠ మహోత్సవాలకు ఎమ్మెల్యే పెద్దారెడ్డికి ఆహ్వానం

ఈనెల 22న అయోధ్య రామ మందిరం విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలోని గాంధీకట్ట వద్ద నిర్వహించే మహోత్సవాలకు శ్రీరామ భక్తమండలి సభ్యులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆహ్వానించారు. గురువారం సాయంత్రం శ్రీరామ భక్తమండలి సభ్యులు రాధాకృష్ణ, మహేశ్వరశర్మ తదితరులు ఎమ్మెల్యే పెద్దారెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



పెద్దవడుగూరు జట్టుకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. వారం రోజుల నుంచి మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో యాడికి గ్రామానికి చెందిన కోడూరు రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. టోర్నీలో 36 జట్లు పాల్గొనగా విన్నర్స్‌గా పెద్దవడుగూరు, రన్నర్స్‌గా యాడికి, మూడో స్థానంలో నరసాపురం జట్టు నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు విజయ్, సుబ్బారెడ్డి, బాల చంద్రారెడ్డి వరుసగా రూ.30 వేలు,రూ.20 వేలు, రూ.10 వేలు నగదు బహుమతిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. క్రీడాకారుల కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వంకటరామిరెడ్డి, సీనియర్ నేత బాలా రమేష్‌బాబు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం చరిత్రాత్మకం



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న కమిషనర్ మల్లికార్జున, మాజీ చైర్మన్ రామలింగప్ప

గుంతకల్లుటౌన్: విజయవాడ స్వరాజ్ మైదానంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం చరిత్రాత్మకమని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు గుంతకల్లు నుంచి వెళ్తున్న బస్సులను గురువారం వారు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఎంపీడీఓ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, మెప్మా టీపీఆర్ఓ మోహన్, ఆర్ఐ ఎర్రిస్వామి, 3వ వార్డు ఇన్‌ఛార్జ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండలం నుంచి పలువురు బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు.

శింగనమల: విజయవాడలో శుక్రవారం జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు శింగనమల నియోజకవర్గం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్సులు విజయవాడకు బయలుదేరాయి.

పంచాయతీల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు



మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం: పంచాయతీల అభివృద్ధికి పక్కాగా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ సునీత అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 2024-25లో చేపట్టబోయే గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో వాటికి ఎంతెంత నిధులు కావాల్సి ఉంటుందో నివేదికలు తయారు చేయాలన్నారు. మండల స్పెషలాఫీసర్ శ్రీదేవి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏఓ శ్రీవాణి, ఎంఈఓ లింగా నాయక్, ఏపీఎం మద్దిలేటి, ఎకాలజికల్ జిల్లా కోఆర్డినేటర్ శివ శంకర్, రీసోర్స్ పర్సన్ సుబ్బరాయుడు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యల్లనూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీరరాజు మాట్లాడుతూ ప్రతి పంచాయతీ అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, మురుగు తదితర వంటి వాటిపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

గార్లదిన్నె: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపొందించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ వెంకటనారాయణ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీడీఓ విజయ భాస్కర్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో గుంతల త్వవకానికి ధర ఖరారు



మాట్లాడుతున్న తహసీల్దార్ మహబుబ్‌బాషా

గుత్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శ్మశాన వాటికల్లో గుంతల త్వవకానికి రూ.2,500 చొప్పున ధర ఖరారు చేసినట్లు తహసీల్దార్ మహబుబ్‌బాషా పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్మశానాల్లో గుంతల తవ్వకానికి అధిక ధర వసూలు చేస్తున్నారని పట్టణంలోని పైమాలగేరి, బెస్తగేరి, బోయగేరితోపాటు పలు కాలనీలకు చెందిన ప్రజలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ గురువారం తన కార్యాలయంలో ఇరువర్గాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని శ్మశానాల్లో గుంతల తవ్వకానికి అధిక ధర వసూలు చేయడం సామాన్యులకు ఆర్థికంగా భారమైందన్నారు. ఇక నుంచి గుంతలు తవ్వకానికి రూ.2,500 మించి వసూలు చేయరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధర వసూలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్మశానాల వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

పత్ర కులస్తులను బీసీ ఏ కింద చేర్చాలి

గార్లదిన్నె: ప్రభుత్వం పత్ర కులస్తులను బీసీ ఏ కింద చేర్చాలని పత్ర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ కోరారు.గురువారం పత్ర సంక్షేమ సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం శుక్రవారం నుంచి చేపట్టే కులగణన సర్వేలో పత్ర కులస్తులను బీసీ ఏ కింద చేర్చాలన్నారు. ప్రభుత్వం జీఓ 8లో పత్ర కులస్తులను బీసీఏ కింద చేర్చాలని 2006లో జీఓ విడుదల చేసిందన్నారు. కానీ అధికారులు జీఓ అమల్లో జాప్యం చేస్తున్నారన్నారు. సంఘం రాష్ట్ర సభ్యులు బృందవన్ రామాంజనేయులు, ఉప్పలపాటి రామక్రిష్ణ, ఉపాధ్యక్షుడు చీమల శ్రీనివాసులు, శింగనమల నియోజక వర్గ అధ్యక్షుడు చీమల రామక్రిష్ణ, మండలాధ్యక్షులు శ్రీనివాసులు, శ్రీరామ్, వీరేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

యాడికి: ఈ నెల 20న నగరూరులో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం విద్యుత్ బ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో నగరూరు, భోగాలకట్ట గ్రామాలకు ఎమ్మెల్యే వచ్చిన సమయంలో ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం సమస్య రావటంతో తన తండ్రి టీచర్ నాగిరెడ్డి జ్ఞాపకార్థం నగరూరు పంచాయతీలో దాదాపు రూ.40లక్షలు విలువ చేసే 1.25 ఎకరాల భూమిని విద్యుత్ సబ్ స్టేషన్‌కు వితరణ చేశామన్నారు. రూ.1.7 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయిందన్నారు. కార్యక్రమానికి ఎంపీ తలారీ రంగయ్య, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి హాజరవుతున్నట్లు వెంకటరామిరెడ్డి తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే 'జొన్నలగడ్డ' జన్మదిన వేడుకలు



శింగనమలలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ యోగేశ్వరి, నాయకులు



బీకేఎస్‌లో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు

శింగనమల: శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి జన్మదినం వేడుకలను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సింగిల్ విండో కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ యోగేశ్వరి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కీలకంగా పని చేశారన్నారు. కొన్ని దశాబ్దాలుగా అమలుకు నోచుకోని శింగనమల చెరువుల లోకలైజేషన్ చేయించారన్నారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయించారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ, సర్పంచ్‌లు నాగమునెమ్మ, వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి బండి లలిత కళ్యాణి, యువజన విభాగం మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు ఓబులపతి, నాయకులు మల్లికార్జునరెడ్డి, అబ్దుల్లా, ఆదిశేషు, లోకనాథ్, బండి శ్రీనివాసులు, చౌరెడ్డి, ఓబిలేసు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజక వర్గంలో అభివృద్ధి సంక్షేమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చిరునామాగా నిలిచారని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక సొసైటీ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజక వర్గంలో చరిత్రలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, ఎస్టీసెల్ మండల కన్వీనర్ సాకే లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: మండల కేంద్రంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు పురుషోత్తంనాయుడు కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు.

గార్లదిన్నె: ఎంపీపీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామోహ్మన్ రెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మండల స్థాయిలో ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా'



పుట్లూరు: విజేతగా నిలిచిన కుమ్మనమల కబడ్డీ జట్టుతో అధికారులు

పుట్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. చివరి రోజు కబడ్డీలో కుమ్మనమల, వాలీబాల్‌లో శనగల గూడూరు విజేతగా నిలిచాయి. విజేతలుగా నిలచిన జట్లు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు.

యాడికి: మండలంలోని మోడల్ స్కూల్ క్రీడా మైదానంలో గురువారం జరిగిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో యాడికి నం:2 సచివాలయం జట్టు గెలుపొంది నియోజక వర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ లక్ష్మినారాయణ తెలిపారు. ఎంఈఓ కాశెప్ప, పీడీలు నాగేంద్ర బాబు, ఓబుళమ్మ, చిన్న ఓబులేసు, మహబూబ్ బాషా, మల్లికార్జున, వీరేష్, లోకేశ్వరి పాల్గొన్నారు.

మద్యం విక్రేత్రల అరెస్ట్

గార్లదిన్నె: కోటంకలో నాగిరెడ్డి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 14 మద్యం బాటిళ్లు, ముంటిమడుగు కొత్తపల్లిలో గుజ్జల మల్లికార్జున అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 6 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాగర్ గురువారం తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఓటరు దరఖాస్తుల పరిశీలన పూర్తి

శింగనమల: నియోజకవర్గంలో ఈనెల 12 వరకు ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించినట్లు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి సుధారాణి తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 22న ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు. ఓటరు జాబితా బీఎల్వోల వద్ద ఉంటుందని, తమ పేర్లు నమోదు కాకుంటే, అర్హులైతే ఓటరు నమోదు చేసుకోవచ్చునన్నారు. తహసీల్దార్లు ఈశ్వరమ్మ, ఉషారాణి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

పామిడి: ఎద్దులపల్లిలో నలుగురు రైతులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటార్ల కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ వంశీ, తాతయ్య, జింకల వెంకటేష్, బీ సుదర్శన్ విద్యుత్ మోటార్ల కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దుండగులను గమనించిన రైతులు వారిని వెంబడించగా దొంగలు వారు తెచ్చుకున్న బైక్‌ను వదిలేసి పరారయ్యారు. రైతులు బైక్‌ను పోలీసులకు అప్పగించారు.

శ్రీపురం నామకరణం హర్షణీయం



ఎమ్మెల్యే వైవీఆర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

గుత్తి రూరల్: కోజ్జేపల్లి గ్రామం పేరును శ్రీపురంగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామం పేరు మార్పునకు కృషి చేసిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని గురువారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీపురం గ్రామస్తులు ఎమ్మెల్యేతోపాటు గుత్తి సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ మంజునాథ్‌రెడ్డిని పూలమాలతో, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గుత్తి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీలయాదవ్ మాట్లాడుతూ మండలంలోని ఈ గ్రామం పేరు చెప్పాలంటేనే ఎంతో అవమానంగా భావించేవారమన్నారు. గ్రామం పేరు మార్చాలని ఎన్నో పోరాటాలు చేసినప్పటికీ ఎవరూ ఆలకించలేదన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే గ్రామం పేరు మార్చాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. అందులో భాగంగా జీఓ -542 ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. తమ చిరకాల కోరికగా ఉన్న గ్రామం పేరును మార్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే వైవీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. గ్రామం పేరు మార్పునకు సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా, మండల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు మహాలింగ, రాముయాదవ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ విగ్రహ అపహరణకు విఫలయత్నం

పెద్దపప్పూరు: కొట్టాలపల్లిలో గురువారం తెల్లవారుజాము గుర్తుతెలియని దుండగుడు పెద్దమ్మ తల్లి పంచలోహ ప్రతిమను ఎత్తుకెళ్లేందుకు విఫల యత్నం చేశాడు. వివరాలు.. గుర్తు తెలియని దుండగుడు పెద్దమ్మ తల్లి మండపంలో ఉన్న విగ్రహాన్ని ఎత్తుకెళ్లేందుకు యత్నించే క్రమంలో శబ్దం వచ్చింది. సమీపంలో ఉన్న ఓ యువకుడు అప్రమత్తమై కేకలు వేయడంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

ఇద్దరు దొంగల పట్టివేత

పామిడి: స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని మసీదు వద్ద బుధవారం రాత్రి పెట్రోలు దొంగలిస్తున్న ఇద్దరిని స్థానికులు బంధించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు... గుత్తి రోడ్డులో ఉన్న మోటార్ మెకానిక్ షాప్‌ల వద్ద నిలిపి ఉంచిన వాహనాల నుంచి బుధవారం రాత్రి పెట్రోల్ చోరీ చేస్తూ పామిడికి చెందిన బోయ సుధీర్, మొండోళ్ల అనిల్ పట్టుబడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నిందితులను అదుపులోకి విచారణ చేపట్టారు.

హెల్త్ వెల్నెస్ సెంటర్ పరిశీలన

గార్లదిన్నె: బూదేడు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను గురువారం నేషనల్ క్వాలిటీ ఎసెస్‌మెంట్ బృందం సభ్యులు పరిశీలించారు. సెంటర్‌లో అందిస్తున్న వైద్య సేవలు, రికార్డులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును అడిగి తెలుసుకున్నారు. పనితీరు, రికార్డులు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలకులు డాక్టర్ సునీల్ కుమార్, బ్రిజ్ మోహన్, పీహెచ్‌సీ డాక్టర్ దిలీప్, ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుత్తి: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. రెండు రోజుల నుంచి పోర్టు రైల్వే స్టేషన్‌లో ఆ గుర్తు తెలియని వ్యక్తి నిస్సహాయ స్థితిలో పడి ఉన్నాడు. బుధవారం కళ్యాణ్ కన్నా అనే వ్యక్తి గమనించి అతడిని 108లో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. చికిత్స ఫలించకపోవడతో గురువారం మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ నబీరసూల్ కేసు నమోదు చేశారు.

సదరం క్యాంప్ వాయిదా

శింగనమల: స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించాల్సిన సదరం క్యాంపు వాయిదా వేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్. రమణనాయక్ తెలిపారు. ఈనెల 22న సదరం క్యాంపు ఉంటుందని, దరఖాస్తుదారులు గమనించాలని సూచించారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

పెద్దపప్పూరు: పి.కొట్టాలపల్లిలో గురువారం అయోధ్యరాముని అక్షింతలను గ్రామానికి చెందిన హనుమాన్ భజన బృందం సభ్యులు ఇంటింటా పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో స్వామి ప్రతిష్ఠ సందర్భంగా శ్రీరాముల చిత్రపటానికి అక్షింతలు వేసి పూజ చేయాలని గ్రామస్తులకు వివరించారు.